క్లుప్తంగా

18న ప్రత్యేక పూజలు

జగద్గిరిగుట్ట: ఈ నెల 18న మహా శివరాత్రిని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట కొండపై ఉన్న సలాసర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, అర్చన, రాత్రి 8 గంటలకు మురారి దాహిమా బృందం సభ్యులతో భజన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

కోవిడ్ లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం సూరారం కాలనీలోని యూపీహెచ్‌సీలో 13 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటీవ్ రిపోర్ట్‌లు వచ్చాయని వైద్యాధికారులు తెలియజేశారు. దుండిగల్ పీహెచ్‌సీ, షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీల్లో సైతం కోవిడ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అనుమానితులు టెస్ట్‌లు చేయించుకోవాలని మండల వైద్యాధికారి నిర్మల్ తెలిపారు.

చర్ల ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కొలన్ గోపాల్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని చర్ల ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం టీకుల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆవుల జగన్‌యాదవ్, వెంగయ్యచౌదరి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, చర్ల ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజ్‌యాదవ్, 10వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బైండ్ల నాగేష్, టీకుల కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యురాలు నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



స్విమ్మర్ పుల్లారెడ్డిని సత్కరించిన బీఆర్‌ఎస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్‌లో రికార్డు నెలకొల్పిన రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడకు చెందిన పుల్లారెడ్డిని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సత్కరించారు. గచ్చిబౌలిలో శనివారం జరిగిన 5వ ఆల్ ఇండియా మాస్టర్ స్విమ్మింగ్ పోటీల్లో 50–54 సంవత్సరాల విభాగాల పుల్లారెడ్డి మూడు బంగారు పతకాలు సాధించి రికార్డు సొంతం చేసుకున్నారు. ఆదివారం నిజాంపేట్‌లోని తన కార్యాలయంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆయన్ని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి,కన్నారెడ్డి పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు రుసుము చెల్లించాలి



ఆటోకు మైక్ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ కొరకు 59 జీవో కింద డిమాండ్ నోటీసులు అందుకున్న వారు నిర్ణీత గడువులోపు ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును చెల్లించాలంటూ కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు ఆదివారం మైకు ద్వారా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయం గడవలోపు డబ్బులు చెల్లించకుంటే వారి దరఖాస్తు రద్దు అవుతుందని తెలిపారు.

కబీర్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తా

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం స్థానిక కమిటీ హాలులో జరిగాయి. ఇద్దరు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ చేయగా సమీప అభ్యర్థి పి. శ్రీనివాస్‌గౌడ్‌పై కె. జోసెఫ్ గెలుపొందారని ఎన్నికల అధికారి సంఘం సురేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కె. జోసెఫ్ మాట్లాడుతూ.. తాను గతంలో చేసిన అభివృద్ధి తన విజయానికి దోహదపడ్డాయని తెలిపారు.

అటకెక్కిన ఆరోగ్య కిట్ల పంపిణీ

- బాలికల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రారంభం
- మూడు నెలలు సజావుగా సాగి అర్ధంతరంగ నిలిచిన వైనం



ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు

రంగారెడ్డినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అందిస్తున్న ఆరోగ్య కిట్ల పంపిణీ అటకెక్కింది. దీంతో బాలికలకు ఆగచాట్లు తప్పడం లేదు. బాలికల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా 2019లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యస్తున్న విద్యార్థినులకు రాష్ట్ర ప్రభుత్వం 2019లో ఆరోగ్య కిట్ల పంపిణీని ప్రారంభించింది. అయితే రెండు, మూడు నెలల పాటు సజావుగా అందించినా ఆ తరువాత ఏమైందో ఏమో.. హెల్త్ కిట్ల పంపిణీని అర్ధంతరంగా నిలిపి వేశారు.. ఇదే క్రమంలో కరోనాతో చాలా మంది పిల్లలు కుటుంబ ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం కావడంతో ప్రైవేట్ పాఠశాలల్లో చేరే స్తోమత లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతూ వచ్చాయి.. వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం, ఆరోగ్య కిట్లు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థినుల హాజరు శాతంపై ప్రభావం చూపుతోంది.

ఆరు నుంచి పదో తరగతి వరకు..

బాలికల రుతుక్రమ సమయంలో శారీరక పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పేదరికం నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చాలా మంది బాలికలకు ప్యాడ్‌లు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఈ క్రమంలో ఇబ్బందులు పడేవారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ హెల్త్ అండ్ హైజెన్ ఫర్ అడాల్సెంట్ గర్ల్స్ పథకం పేరిట ఆరోగ్య కిట్ల పంపిణీని ప్రారంభించింది. ఈ కిట్లతో 3 సబ్బులు, 3 డిటర్జెంట్లు, కొబ్బరి నూనె సీసా, షాంపూ బాటిల్, పౌడర్ డబ్బా, టూత్ పేస్ట్, టంగ్ క్లీనర్, దువ్వెన, జడ క్లిప్పులు, శానిటరీ నాప్‌కిన్స్ తదితర వస్తువులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే 6 నుంచి 10వ తరగతి బాలికలకు ఈ కిట్లను పంపిణీ చేసేవారు. దీని వల్ల విద్యార్థినుల హాజరు శాతం పెరిగిందని నివేదికలు సైతం వెల్లడించాయి. 2019 విద్యా సంవత్సరం వరకు కిట్ల పంపిణీ సజావుగా జరిగినా 2020 మార్చి నుంచి నిలిచిపోయింది.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలలపై ప్రభావం..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్, గాగిల్లాపూర్, కొంపల్లి, మల్లంపేట్, బౌరంపేట్, డీపోచంపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి, దూలపల్లి, బహదూర్‌పల్లి, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, సూరారం కాలనీ, షాపూర్‌నగర్, జవహర్‌నగర్, గాంధీనగర్, జగద్గిరిగుట్ట, మగ్దూమ్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, సూరారం గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6454 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో చాలా మంది రుతు క్రమం సమయంలో పాఠశాలలకు తప్పనిసరి పరిస్థితుల్లో రాలేకపోతున్నారు. దీంతో వీరి చదువులపై ప్రభావం చూపుతోంది. వీరిలో చాలా వరకు పేద కుటుంబాలకు చెందిన బాలికలు ఉంటున్నారు. ఆరోగ్య కిట్లను అందించిన సమయంలో బాలికల హాజరు శాతం సరిగా ఉండేదని, ముఖ్యంగా ఇటీవల హెచ్చుతగ్గులు వస్తున్నాయని పాఠశాలల ఉపాధ్యాయులే పేర్కొంటున్నారు.

పునః ప్రారంభిస్తాం..



ఆరోగ్య కిట్ల పంపిణీ మొదటి దశ కరోనా నుంచి నిలిచిపోయిన విషయం నిజమే. వివిధ కారణాలతో ప్రభుత్వం వీటిని సరఫరా చేయకపోవడంతో విద్యార్థులకు అందించలేకపోయాం. దీంతో కొంత మేర విద్యార్థినుల హాజరు శాతంపై ప్రభావం చూపింది. ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్యశాఖా మంత్రి హరీష్‌రావు ఆరోగ్య కిట్లను అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం నుంచి కిట్లు అందిన వెంటనే పునః ప్రారంభిస్తాం.

– ఆంజనేయులు, ఎంఈవో కుత్బుల్లాపూర్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

- ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు జరుగనున్న సూరారం శ్రీకట్ట మైసమ్మ జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టాలని ఆదేశించారు. ఆలయ కమిటీ సభ్యులు మన్నె బాలేశ్, వారాల వినోద్, కె.యాదిరెడ్డి, కె.వీరారెడ్డి, వారాల శేషు, సురేష్, మల్లేష్, అంజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధుసుధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.
- సూరారం డివిజన్ న్యూ శివాలయనగర్‌లోని శ్రీముత్యాలమ్మ ఆలయ వార్షిక మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయన్ని శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసింది. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, శివాలయ నగర్ అధ్యక్షుడు శంకర్ నారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరేష్, గోపాల్, ఆంజనేయులు, మూర్తి, కిరణ్, చౌదయ్య, కిష్టయ్య తదితరులు ఉన్నారు.



న్యూశివాలయనగర్‌లోని శ్రీముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్

డివిజన్ల వారీగా ఆప్ ఇన్‌చార్జ్‌ల నియామకం

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడు పెంచింది. డివిజన్ల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ సంస్థాగతంగా బలపడేందుకు యత్నిస్తోంది. ఆదివారం జగద్గిరిగుట్టలోని ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జగద్గిరిగుట్ట కో.ఆర్డినేటర్‌గా శశికాంత్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడిగా మహ్మద్ ఆషరుద్దీన్, ఉమెన్ వింగ్ ఇన్‌చార్జ్‌గా నస్రీన్ పర్వీన్‌లు నియమితులు కాగా వారికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ పుప్పాల సుధాకర్, హైదరాబాద్ లోక్‌సభ కన్వీనర్ ఎండీ మాజీద్ జగద్గిరిగుట్ట ఇన్‌చార్జ్ సతీష్ కుమార్‌తో కలిసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ కో.ఆర్డినేటర్ ఎండీ వాజిద్ మాట్లాడుతూ... ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. భవిష్యత్‌లో తమ పార్టీ బలమైన రాజకీయశక్తిగా ఎదుగుతుందన్నారు.



శశికాంత్‌రెడ్డి, అషరుద్దీన్, నస్రీన్ పర్వీన్‌లకు నియామక ప్రతాలు అందజేసిన దృశ్యం

హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని సీనియర్ సిటిజెన్ కార్యాలయంలో ఆదివారం హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగిన శిబిరంలో 156 మంది పాల్గొని బీపీ, డయాబెటిక్, ఇతర సాధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన హోలిస్టిక్ ఆస్పత్రి యాజమాన్యానికి సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాటకొండ సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి చేపూరి రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రగతినగర్ సీనియర్ సిటిజెన్ కార్యాలయ ఆవరణలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

షాపూర్‌నగర్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 2002-2003 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

రంగారెడ్డినగర్: షాపూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. పాఠశాలలో 2002–2003 సంవత్సరంలో టెన్త్ పాస్ట్ అవుట్ విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో తమ అనుభవాలను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు చదువులు నేర్పిన గురువులను సత్కరించి వారితో తమ అనుబంధాన్ని సభాముఖంగా పంచుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ముద్దాపురం మదన్‌గౌడ్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవనం ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో మూడవ అంతస్తులో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆదివారం రెడ్డి సంక్షేమం సంఘం చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఐకమత్యంతో మెలుగుతూ సంఘం తరపున రెడ్డి సంఘం భవనం నిర్మించి అందరికి ఆదర్శంగా నిలవడం శుభపరిణామమని అన్నారు. అధ్యక్షుడు రామిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని దాసరిబస్తీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, పలు అభివృద్ధి పనులను ఆదివారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దాసరి బస్తీ, బుడగ జంగం బస్తీల్లో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలు, మంచినీటి పైపులైన్‌తో పాటు సీసీరోడ్డు వేసినందుకు కాలనీవాసులు కార్పొరేటర్ రవీందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు విచ్చేసి రాష్ట్ర పార్టీ నిర్దేశించిన శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ ఎలా నిర్వహించాలో వారికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు రామ్మోహన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రిని సందర్శించిన ఐఎంఏ బృందం



బాచుపల్లిలోని ఆస్పత్రిని సందర్శిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బృందం

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రిని ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఐఎంఏ సభ్యులకు ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు వారికి ఆస్పత్రిలో ఉన్న వివిధ విభాగాలు, అందిస్తున్న అత్యాధునిక చికిత్స విధానాలను వివరించారు. ఐఎంఏ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, కార్యదర్శి డాక్టర్ జె.విజయ్‌రావు, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ రాజేంద్రకుమార్ యాదవ్, ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ పి.కాళీప్రసాదరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ గట్టు శ్రీనివాసులు, డాక్టర్ సీహెచ్. జగన్మోహన రావు, డాక్టర్ ఏసీహెచ్.పుల్లారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు డాక్టర్ ఎ.యశోవంత్‌రావు, డాక్టర్ హరి సంధ్యారాణి, డాక్టర్ మహ్మద్ అలీమ్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ వి.జగదీశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎంఎల్ఎస్ రెడ్డి, డాక్టర్ ఆనంద్ భోక్రే తదితరులు ఉన్నారు.

త్రివేణి కిడ్స్ స్కూల్‌లో సైన్స్ ఉత్సవ్

కుత్బుల్లాపూర్: చింతల్ త్రివేణి కిడ్స్ స్కూల్‌లో సైన్స్ ఉత్సవ్–యాన్యువల్ సైన్స్ ఇంపోజీయం 2023ను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవ్‌లో యూకేజీ నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొని 400 సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల ఎస్ఐ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై సైన్స్ ఉత్సవ్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల నమూనాలను తిలకించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ నళిని మాట్లాడుతూ.. కరిక్యూలమ్‌లో భాగంగా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రతి సంవత్సరం వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివేణి సంస్థల సైన్స్ అధికారి సుబ్బారావు, జోనల్ ఇన్‌చార్జ్ చక్రీ, సీఆర్‌ఓ వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్స్ ఉత్సవ్‌లో పాల్గొన్న జీడిమెట్ల ఎస్ఐ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ నళిని

వైభవంగా శివపూజ మహోత్సవం



శివ పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ పరిధి నల్లగుట్టలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం ద్వాదశ జ్యోతిర్లింగ 22వ శివపూజ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శివుని అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలన్నారు. అందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని మనసారా కోరుకున్నట్లు శ్రీశైలంగౌడ్ తెలిపారు. ఆలయంలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త దూదిమెట్ల సోమేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజారామ్, కమిటీ సభ్యులు, శివ భక్తులు, స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి

మూసాపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతిని ఆదివారం మూసాపేట గూడ్స్ షెడ్‌రోడ్డులో పాతపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై రమాబాయి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, గోపాల్, డాకయ్య పాల్గొన్నారు.

ప్రివెంటివ్ మెడిసిన్ ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ఓమ్ని ఆసుపత్రిలో ఆదివారం సీనియర్ సినీ నటుడు సుమన్ ట్విలైట్ లాంజ్ ద్వారా ప్రివెంటివ్ మెడిసిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ రోగం అయినా తుది దశలో గుర్తించినట్లయితే దాని నివారణ మరింత సఫలీకృతం అవుతుందన్నారు. 40 ఏళ్లు నిండిని ప్రతి ఒక్కరూ 6 నెలలకి ఒక్కసారి ప్రివెంటివ్ హెల్త్ చెకప్ చేయించుకోవటం చాలా అవసరమన్నారు. నయం చేయడం కంటే నివారణే మేలు అనేది అందరూ గమనించాలన్నారు. ఈ కోణంలో ఓమ్ని హాస్పటల్ వారు ప్రివెంటివ్ హెల్త్ చెకప్‌లు కోసం ఒక స్పెషల్ లాంజ్‌ని క్రియేట్ చేయటం గమనార్హం. ఈ సందర్భంగా మీడియా జర్నలిస్టులకు ఓమ్ని హాస్పటల్ హెల్త్ చెకప్ కూపన్‌లు స్వాస్త్ కార్డు ద్వారా అందించారు. ఈ స్వాస్త్ కార్డు ద్వారా 2 లక్షల 50 వేల వరకు యాక్సిడెంట్ బెనిఫిట్స్, 40 వేల వరకు రీయింబర్సుమెంట్ సౌకర్యం, క్యాష్ బ్యాక్ సౌకర్యం వంటి బెనిఫిట్స్ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి గ్రూప్ సీఓఓలు డాక్టర్ నగేష్, డా. హరీస్ గిగిల్స్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓమ్ని ఆసుపత్రిలో ప్రివెంటివ్ మెడిసిన్‌ను ప్రారంభించిన హీరో సుమన్, తదితరులు

ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాలు, ప్రజలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు, వివిధ కార్యక్రమాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

- చింతల్ డివిజన్‌కు చెందిన సునీల్‌కుమార్ కుమారుడు మనీష్ ఇటీవల ఆర్మీలో చేరాడు. శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసిన మనీష్‌ను అభినందిస్తూ దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరడం అభినందనీయమని ప్రశంసించారు. కార్పొరేటర్ జగన్, దుండిగల్ కౌన్సిలర్ శంకర్ నాయక్, నాయకులు మహ్మద్ రఫీ, బాల్‌రెడ్డి, ఉప్పలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వరదరాజు, సాయి, రమణ, పూర్ణచందర్ రావు,జోన్ వెస్లీ, తదితరులు ఉన్నారు.
- గాజులరామారం నల్లగుట్టపై ఉన్న శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం జరిగిన ద్వాదశ జ్యోతిర్లింగ శివ మహా పడి పూజలో ఎమ్మెల్సీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాభివృద్ధికి తన వంతు సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.
- ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, కార్పొరేటర్లు రావుల శేషగిరి, జగన్, మంత్రి సత్యనారాయణ, నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, 125 డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామ్ రెడ్డి, నాయకులు పృథ్వీ, చందు, బంటి, నగేష్, శివముదిరాజ్, మల్లేష్, విజయ్, గురు స్వాములు, శివస్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- నాగులూరులో ఈనెల 9వ తేదీన జరిగే శివ పూజ, శివ పార్వతుల కల్యాణోత్సవానికి రావాలని శివస్వాములు ఎమ్మెల్సీని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. నిజాంపేట్ కార్పొరేటర్ చిట్ల దివాకర్, శివస్వాములు ఉన్నారు.



ఆర్మీలో చేరిన మనీష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



నల్లగుట్ట శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ద్వాదశ జ్యోతిర్లింగ శివమహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ